క్లుప్తంగా

ఘనంగా విగ్రహాల ప్రతిష్ట



వాల్మీకి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

పెద్దకడబూరు : మండల పరిధిలోని ముచ్చగిరి గ్రామంలో వాల్మీకి, కనకదాసు విగ్రహాల ప్రతిష్ట సోమవారం ఘనంగా చేపట్టారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేపట్టి విగ్రహాల ప్రతిష్టాపనకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, బూత్ కమిటీ డివిజన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, యూత్‌వింగ్ రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి ఈరన్న, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామికి పూజలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని మసీదపురం గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రావణ మాసం రెండవ సోమవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌతాళం మండలంలోని శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి అందుకుంటున్న పూజల మాదిరాగానే ఇక్కడ లక్ష్మీనరసింహస్వామి పూజలు అందుకుంటున్నారు.

వరుణుడి కోసం..



సప్త భజన చేస్తున్న గ్రామస్తులు

పెద్దకడబూరు : వరుణుడు కరుణించి వర్షం కురవాలని మండల పరిధిలోని చిన్నకడబూరు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణంలో చేపట్టిన సప్త భజన కార్యక్రమం సోమవారం భజన రెండోరోజుకు చేరుకుంది. భజన కార్యక్రమాన్ని గ్రామంలోని భక్తులు ఏడు బృంధాలుగా ఏర్పడి ఒక్కో బృందం రెండు గంటల చొప్పున 7రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామ పెద్దలు, భక్తులు తెలిపారు.

నందవరం : మండలం కేంద్రంలోని భక్తులు దాదాపు 200 మంది సోమవారం కాలినడకన గంగవరం గ్రామంలోని తుంగభద్ర నదీ జలాలను కుండల్లో నింపుకొని పాదయాత్ర చేస్తూ నందవరం చేరుకున్నారు. గ్రామ దేవతలకు జలాభిషేకాలు గావించారు.

యూరియా అక్రమ రవాణాను అరికట్టాలి

నందవరం : యూరియా అక్రమ రవాణాను వ్యవసాయాధికారులు అరికట్టాలని బీజేపీ మండల నాయకుడు గురురాజ్‌దేశాయ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో రైతులతో కలిసి ఏఓ సరిత, సొసైటీ అధికారులను బీజేపీ మండల నాయకుడు యూరియా స్టాక్, పంపిణీపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ..మండలంలో సొసైటీకి 4,380 బ్యాగుల యూరియా వచ్చిందని, రైతులకు పంపిణీ చేశారన్నారు. అయితే రికార్డు పరంగా పంపిణీ వివరాలు అడిగితే లేవని చేబుతున్నారన్నారు. మండలానికి వచ్చిన యూరియా అక్రమంగా ప్రైవేట్ షాపులకు తరలిపోతుందని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామన్నగౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ నిర్మాణానికి విరాళం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ మదర్ థెరిసా అమ్మానాన్న వృద్ధాశ్రమ నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన సివిల్ కంట్రాక్టర్ జె.చక్రవర్తి సోమవారం రూ.80వేల విలువైన రేకులు, నిర్మాణ సామాగ్రిని నిర్వాహకులకు అందజేశారు. సొసైటీ నిర్వహకులైన సింగేటి నరసన్న, ప్రతిభా భారతిలకు ఆయా సామాగ్రిని అప్పగించారు.

7న మార్కెట్‌యార్డుకు సెలవు ప్రకటించాలి

ఆదోని అర్బన్: శ్రీ జీవేశ్వర్ జయంతి సందర్భంగా ఈనెల 7న ఆదోని మార్కెట్‌యార్డుకు సెలవు ప్రకటించాలని స్వకులసాలే సమాజ్ గౌరవ సభ్యులు జిందే శంకర్, సమాజ్ ప్రధాన కార్యదర్శి జిందే లక్ష్మణ్ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక మార్కెట్‌యార్డులో అసిస్టెంట్ సెక్రటరీ శాంతమూర్తిని కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో అంబాభవాని దేవాలయం కమిటీ సభ్యులు కొంగే పంపాపతి, మార్కెట్‌యార్డు గుమస్తా ప్రెసిడెంట్ లక్ష్మణ్, సభ్యులు శంకర్, కిరణ్, శ్రీనివాసులు, బాలాజీ, సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యం తగదు

పెద్దకడబూరు : ఎమ్మిగనూరు నుంచి జాలవాడి, కంబలదిన్ని గ్రామం మీదుగా మాలపల్లి వరకు ఉన్న ప్రధాన రహదారి నిర్మాణంలో కూటమి ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం తగదని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి మంచాల లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు గుడిపి సామేలు అన్నారు. మండల పరిధిలోని జాలవాడి గ్రామ బస్టాండ్ ఆవరణలో బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, నాయకులు ఉరుకుంద, బాషా పాల్గొన్నారు.

నీళ్లున్నా.. ఎత్తిపోయలేని పథకాలు

- నిండుగా ప్రవహిస్తున్న తుంగభద్ర
- పంపింగ్ ప్రారంభం కాని ఎత్తిపోతల పథకాలు
- పగిలిన రిజర్వాయర్ పైపులైన్
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- పంటలకు నీళ్లు ప్రశ్నార్థకం



నీళ్లు లేక వెల వెల బోతున్న దుద్ది రిజర్వాయర్



పగిలిన దుద్ది రిజర్వాయర్ పైపులైన్



ఆర్డీఎస్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర నది

కోసిగి: జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో సాగునీరు అందితేనే పంటల సాగు. లేదంటే మూటముళ్లె సర్దుకుని పిల్లపాపలతో వలస వెళ్లక తప్పదు. అలాంటి కరువు ప్రాంత రైతు ఆశలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తుంగభద్ర నదిలో పుష్కలంగా వరద నీరు ప్రవహిస్తున్నా.. ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్లు మాత్రం నీళ్లు లేక వెలవెలబోతున్నాయి. ఎత్తిపోతల పథకాలకు పంపింగ్ ప్రారంభిచంకుండా ప్రభుత్వ, అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో ఖరీఫ్‌లో సాగునీటి పై ఆశలు సన్నగిల్లుతున్నాయి.

16,500 హెక్టార్ల సాగు భూమి

కోసిగి మండలంలోని 90 శాతం ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం. మండలంలో ఖరీఫ్‌లో వర్షధారం కింద దాదాపు 16,500 హెక్టార్లు భూములు సాగుచేసుకుని పంటలు పండించుకుంటారు. ఇందులో ఆయకట్టు భూములు దుద్ది రిజర్వాయర్ కింద 3,500 ఎకరాలు, మూగలదొడ్డి రిజర్వాయక్ కింద 3,700 ఎకరాలు సాగు చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులు కేటాయించకపోవడం, ఎత్తిపోతల పథకాలు మెయింటెనెన్స్, మరమ్మతులు చేపట్టకపోవడంతో గతేడాది పూర్తి స్థాయిలో ఆయకట్టుదారులకు సాగునీరు అందించలేక పోయారు. ఈఏడాది కూడా సాగునీటి అందిస్తారో లేదో నని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

మూగలదొడ్డి రిజర్వాయర్ పరిస్థితి ఇలా..

మండలంలోని మూగలదొడ్డి ఎత్తిపోతల పథకం కింద 3700 ఎకరాలు ఆయకట్టు భూములు ఉన్నాయి. మూగలదొడ్డి, అగసనూరు, జంపాపురం, చిర్తనకల్లు, ఐరన్‌గల్లు, సాతనూరు వరకు ప్రవహిస్తోంది. ఎత్తి పోతల పథకం వద్ద రెండు మిషన్లు ఉన్నాయి. ఒకటి మరమ్మతులకు గురైంది. రెండేళ్లుగా రిపేరి చేసిన దాఖలాలు లేవు. ఒక మిషన్‌తో రైతులు దగ్గరుండి పంపింగ్ చేయించుకుంటున్నారు. ఒక మిషన్‌తో రిజర్వాయర్‌లోకి నీరు అరకొరగా వచ్చి చేరుతున్నాయి. రెండు మిషన్లతో పంపింగ్ చేసి త్వరితగతిన రిజర్వాయర్ నింపాలని రైతులు కోరుతున్నారు. అలాగే మంత్రాలయం మండలంలోని బసలదొడ్డి ఎత్తి పోతల పథకానికి గతేడాది ఒక్క చుక్క నీరు కూడా అందించలేక పోయారు. ఈ ఏడాది కూడా అందిస్తారో లేదో నని రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం స్పందించి ఎత్తి పోతల పథకాలకు నిధులు కేటాయించి రిజర్వాయర్ ద్వారా నీటిని అందించి పంటలను కాపాడాలని రైతులు కోరారు.

దుద్ది ఎత్తిపోతల పథకం దుస్థితి

తుంగభద్ర నది ఒడ్డున సాతనూరు సమీపంలో నిర్మించిన దుద్ది ఎత్తిపోతల పథకం మిషన్లు మరమ్మతులు నోచుకోక పంపింగ్ ప్రారంభం కాలేదు. ఈ రిజర్వాయ కింద దుద్ది, కోసిగి, దేవరబెట్ట, డి.బెళగల్ వరకు 3500 ఎకరాలకు సాగునీటిని అందించాల్సి ఉంది. అలాగే నీటిని సరఫరా చేసే దుద్ది పొలాలలో నెల రోజుల క్రితం పైపులైన్ పగిలిపోయింది . ఇంత వరకు మరమ్మతులు చేపట్టలేక పోయారు. అలాగే నదిలో వరద నీరు వృథాగా దిగువ ప్రాంతాలకు తరలి పోతున్నాయి. రిజర్వాయర్ పరిధిలో పంటలు సాగు చేసుకున్న రైతులు సాగుచేసిన పంటలు వర్షాలు లేక ఎండిపోయే స్థితికి చేరాయి. రిజర్వాయర్‌లో నీళ్లు అడుగంటాయి. దీంతో ఈ ఏడాది పంటలకు ఎలా కాపాడుకోవాలో అర్థం కావడం లేదని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులు చేయించండి



దుద్ది రిజర్వాయర్‌లో నీళ్ల లేక వెలవెలబోతోంది. నదిలో వరద నీరు వృథాగా దిగువ ప్రాంతాలకు తరలి పోతున్నాయి. పైప్‌లైన్ పగిలి నెల రోజులు కావస్తున్నా రిపేరి చేయలేదు. ఇంతవరకు పంపింగ్ చేపట్టలేదు. రిజర్వాయర్ కింద పంటలు సాగుచేసుకున్న రైతులు సాగునీటి అందిస్తారో లేదోనని ఆందోళనగా ఉంది. అధికారులు వెంటనే మరమ్మతులు చేసి రిజర్వాయర్‌ను వరదనీటితో నింపి రైతులకు సాగునీటిని అందించి ఆదుకోవాలి.

– నాడుగేని వీరారెడ్డి, రైతు, కోసిగి

సాగునీటిని అందించాలి



కోసిగి మండలం జిల్లాలనే కరువు ప్రాంతం. పంటలపై ఆధార పడి జీవనం సాగిస్తున్నారు. మండంలోని ఉన్న ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేయించి చివరి ఆయకట్టు దారులందరికీ సాగునీటిని అందించి ఆదుకోవాలి. ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలు గడిచి పోతున్నా, ఇంతరవకు పథకాలు మరమ్మతులు చేపట్టకపోవడం విచారకరం. అధికారులు స్పందించి మరమ్మతులు చేసి సాగునీటిని అందించాలి.

– గోపాల్, రైతు సంఘం తాలూకా కార్యదర్శి

ప్రతిపాదనలు పంపాం

దుద్ది రిజర్వాయర్‌కు పైప్‌లైన్ పగిలిపోయింది. మరమ్మతులు చేయించాలని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే మరమ్మతులు చేసి రిజర్వాయర్‌కు నీటిని పంపింగ్ చేపడుతాం. అలాగే మూగలదొడ్డి రెండవ మిషన్ రిపేరి చేయించేలా చూస్తాం. ఖరీఫ్, రబీలో ఎత్తిపోతల పథకాలు నుంచి సాగునీటిని అందించేలా చర్యలు తీసుకుంటాం.

– ప్రేమ్, గురురాఘవేంద్ర ప్రాజెక్ట్ ఏఈ

పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయండి



బుట్టా రేణుకను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ యూత్ మండల అధ్యక్షుడు

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలని, ఇందుకు యువతలో ఉత్సాహం నింపాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక సూచించారు. పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడిగా నియామకమైన బనవాసి బసిరెడ్డి సోమవారం ఆమెతో పాటు, సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠను సత్కరించారు. తనకు పార్టీ యూత్ పదవి ఇచ్చినందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌కు, ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ మండలంలో యువత పార్టీ వైపు వచ్చేందుకు కృషి చేసి, పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రామలింగడు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

మంత్రాలయం రూరల్ : గ్రామాల్లో వైద్యాధికారులు, సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎఫ్‌డీపీ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు ఆదేశించారు. సోమవారం మండల పరిధిలోని కల్లుదేవకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే టీకాలు, వైద్య సేవలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ గోవిందమ్మ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు



ప్రజా సమస్యలను వింటున్న సబ్‌కలెక్టర్

ఆదోని రూరల్: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో వచ్చిన ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా అధికారులు వేగవంతంగా పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించి డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆ యాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్‌ఎల్‌ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారి వసుంధర, డీఎల్పీవో తిమ్మక్క, డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, శ్రీనివాసరాజు, ఆదోని డివిజన్ వ్యవసాయ శాఖ అధికారులు బాలవర్ధిరాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ చొరవతో భూసమస్య పరిష్కారం



కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు కృతజ్ఞతలు తెలుపుతున్న రైతు విశ్వనాథ్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): దశాబ్ద కాలం నుంచి పరిష్కారం కాని భూ సమస్యకు కలెక్టర్ పి.రంజిత్‌బాషా చొరతో పరిష్కారం లభించింది. ఆదోని మండలం చిన్నగోనేహాల్‌కు చెందిన ఎల్.విశ్వనాథరెడ్డికి సంతకోడ్లూరు గ్రామ పరిధిలోని 435–ఏ సర్వే నంబర్‌లో 1.66 ఎకరాల భూమి ఉంది అతడు 2015లో భూమిని అమ్ముకోవడంతో కొన్నవారు 2018లో లోన్ కోసం వెళ్లగా నిషేధిత జాబితాలో ఉందని చెప్పడంతో విశ్వనాథరెడ్డితో గొడవ పడ్డారు. ఈ క్రమంలో భూమిని వెనక్కి తీసుకొని డబ్బును తిరిగి చెల్లించిన విశ్వనాథరెడ్డి అప్పటి నుంచి నిషేధిత జాబితా నుంచి తొలగించాలని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. చివరకు పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన సమస్యను కలెక్టర్ ప్రాధాన్యతగా తీసుకొని పరిష్కారానికి పూనుకున్నారు. ఆయన పొలం పక్కనే వంకపోరంబోకు 0.81 ఎకరాలు ఉండడంతో రెండు కలిపి మొత్తం 2.47 ఎకరాలను 2016లో అధికారులు నిషేధిత జాబితాలో ఉంచారు. కలెక్టర్ దానిని తొలగించి విశ్వనాథరెడ్డి భూమిని మళ్లీ డినోటిపై చేయడంతో సమస్యకు పరిష్కారం లభించింది. దీంతో బాధితుడు సోమవారం కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

హామీలు విస్మరించడమే చంద్రబాబు నైజం



కూటమి మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు, పార్టీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ప్రతి ఎన్నికల ముందు ఓట్ల కోసం మభ్యపెట్టి మోసం చేయడం సీఎం చంద్రబాబు నైజమని దీనినే కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేష్, వార్డు ఇన్‌చార్జ్‌లు బజారిరెడ్డి, ఫయాజ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, ముస్లిం మైనారిటీ విభాగం పట్టణ అధ్యక్షుడు ముల్లా రసూల్, నియోజకవర్గ అధ్యక్షుడు ఖాశింబేగ్, జిల్లా ఉపాధ్యక్షుడు మహబూబ్‌బేగ్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంకే శివప్రసాద్ అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని 15, 16 వార్డుల్లో చంద్రబాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సీఎం చంద్రబాబునాయుడు ఏడాది పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయక చేసిన మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యాక్టివిటి కార్యదర్శి యూకే రాజశేఖర్, చేనేత విభాగ రాష్ట్ర కార్యదర్శి మాచాని వెంకటేష్, పలు విభాగాల నాయకులు బాబాఖాన్, రుద్రాక్షాల బజారి, సోమేష్, గద్దం అంజి, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 13న లోక్‌అదాలత్

ఆదోని రూరల్: సెప్టెంబర్ 13న జాతీయ లోక్‌అదాలత్ ఉంటుందని ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు, సివిల్, చెక్ బౌన్సు, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాలు, కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు కాకుండా), రాజీ కాదగిన కేసులను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కక్షిదారులు పోలీసులు, న్యాయవాదుల సమక్షంలో రాజీ కావాలని సూచించారు.

ప్రణాళికతో ఉరుకుందలో అభివృద్ధి పనులు



డిప్యూటీ కమిషనర్‌తో చర్చిస్తున్న అధికారులు

కౌతాళం : జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం భవిష్యత్ ప్రణాళికతో అభివృద్ధి పనులకు నివేదిక తయారు చేస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు, తపతి సుబ్రహ్మణ్యం స్వామి, ఎండోమెంట్ శాఖ ఈఈ సతీష్ తెలిపారు. ఉరుకుంద వద్ద భవిష్యత్ ప్రణాళికతో చేసే అభివృద్ధి పనులపై సోమవారం స్థానిక కార్యాలయంలో ఇంజినీరింగ్ శాఖ, తపతి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం డార్మెంట్ హాల్‌ల నిర్మాణాలు, 80 అదనపు గదులతో పాటు మరో 50 సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని, అలాగే సీసీ పేవర్స్ వేయడానికి, సిమెంట్ రోడ్లుతో పాటు డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టడానికి నివేదిక తయారు చేశామన్నారు. అలాగే అన్నదానం కోసం మరో విశాల మైన భవన నిర్మాణం చేపట్టడానికి కూడా నివేదికలో పేర్కొనట్లు వెల్లడించారు. సమావేశంలో డీఈ శ్రీనివాసులు, ఏఈ రవికుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు సి.బెళగల్ గ్రామ వాస్తవ్యులైన మంగమ్మ వారి కుటుంబ సభ్యులు రూ.53,150 నగదును విరాళంగా అందజేశారు. వారికి ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు స్వామి వారి సన్నిధిలో పూజలు చేయించి ప్రసాదాలను అందజేశారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

ఆదోని రూరల్: పట్టణశివారులోని రణమండల కొండల్లో సోమవారం నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 475 లీటర్లు బెల్లంఊటను ధ్వంసం చేసి 27 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎస్.కె.జె.సైదుల్ తెలిపారు. నాటుసారా తయారు చేస్తున్న బోయ నాగిరెడ్డి, బావాజీపేటకు చెందిన బోయ శివలపై కేసు నమోదు చేశామన్నారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

ఆదోని అర్బన్: మండలంలోని కుప్పగల్ గ్రామ సమీపంలో ఆటో బోల్తా పడి నలుగురికి గాయాలయ్యాయి. ఉరుకుంద క్షేత్రం నుంచి ఆదోనికి వస్తుండగా కుప్పగల్ గ్రామ సమీపంలో అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ఈరన్నగౌడ్, లలితమ్మలతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

షడ్రక్‌కు నివాళి

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్ల బస్టాండ్‌లో కేవీపీఎస్ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు టి.షడ్రక్ 5వ వర్ధంతి వేడుకలను సోమవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికుల యూనియన్, ఆటోయూనియన్, డప్పు కళాకారుల సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా షడ్రక్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్, పారిశుద్ధ్య కార్మిక సంఘం నాయకుడు బతకన్న, ఆయా సంఘాల నాయకులు మారేష్, ఈరన్న గౌడ్, ఆది తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో టీబీ నివారణ

ఆదోని టౌన్: జాగ్రత్తలు తీసుకుందాం.. టీబీని ఓడిద్దామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేకు న్‌బాను పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఎరుకల కాలనీలో క్షయ వ్యాధి నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. కాలనీలో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్న వారు, గళ్లలో తెమడ, రక్తం పడడం తదితర లక్షణాలు ఉన్నవారు ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు బాబురాజు, జ్ఞానేశ్వరి, మంజునాథ్, సుబ్బమ్మబాయి పాల్గొన్నారు.

రహదారి నియమాలు పాటించాలి

ఆదోని అర్బన్: ఆటో కార్మికులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఆదోని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు సూచించారు. సోమవారం పట్టణంలోని ఆటో డ్రైవర్లతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఆటోలు నడిపేటప్పుడు డ్రైవింగ్ లైసెన్సు, ఆర్‌సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్, యూనిఫాం తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానించిన రైతు విభాగం మండల అధ్యక్షుడు నరసప్ప

పెద్దకడబూరు : వైఎస్సార్ సీపీ రైతు విభాగం మండల అధ్యక్షుడిగా నియమితులైన మండల పరిధిలోని కంబలదిన్ని గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు నరసప్ప ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని ఆయన స్వగృహంలో సోమవారం శాలువా, పూల మాలతో సన్మానించారు. తనకు పదవి దక్కిడంపై టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వై.సీతారామిరెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ధరణీధర్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, బూత్ కమిటీ డివిజన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ యూత్ టీం చిన్న భీమరాయుడు, శేఖర్, గోపాల్, గుండెకాయల ఉసేని, సోషల్ మీడియా ఖాసీం తదితరులు ఉన్నారు.



దుర్నిగేని శ్రీరాములును అభినందిస్తున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

ఎమ్మెల్యే అభినందనలు

కోసిగి: కానిస్టేబుల్ ఎంపిక పరీక్షల్లో కోసిగికి చెందిన దుర్నిగేని శ్రీరాములు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉద్యోగం సాధించడం గర్వంగా ఉందని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్నా రు. సోమవారం ఆ యువకుడు ఎమ్మెల్యే స్వగ్రామం రాంపురం గ్రామంలో ఎమ్మెల్యే వై. బాలనాగి రెడ్డిని కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ లారీ డ్రైవర్ దుర్నిగేని తిక్కన్న కుమారుడు శ్రీరాములు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి జిల్లాలోనే మంచి పేరు తీసుకొచ్చాడని అభినందించారు.

మోసం చేయడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య



బాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న నాయకులు

పెద్దకడబూరు : ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యం కానీ హామీలు ఇవ్వడం.. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారప్రతినిధి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలోని తారాపురం, రంగాపురం, చిన్నకడబూరు గ్రామాలలో సోమవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాలలో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చేస్తున్న మోసం గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా చిన్నకడబూరు గ్రామంలో నరసన్న భార్య లక్ష్మి తన ముగురు పిల్లలకు తల్లికి వందనం పడలేదని వైఎస్సార్ సీపీ నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై సచివాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగి వేసారి పోయామని మండిపడ్డారు. కార్యక్రమంలో బూత్ కమిటీ డివిజన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు రవిచంద్రరెడ్డి, రాష్ట్ర యూత్ వింగ్ కార్యదర్శి రఘురాముడు, డివిజన్ యూత్‌వింగ్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, వైస్ సర్పంచ్ విజయేంద్రరెడ్డి, జిల్లా యువజన విభాగం కార్యదర్శి శివరామిరెడ్డి, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు ముక్కరన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి ఈరన్న, నాయకులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి వినూత్న సాయం



బియ్యం పంపిణీ చేస్తున్న విశ్రాంత ఉద్యోగి హెచ్. ప్రకాష్

ఆదోని సెంట్రల్: పట్టణలోని పేదలకు విశ్రాంత ఉద్యోగి హెచ్. ప్రకాష్ సోమవారం బియ్యం పంపిణీ చేశారు. సదరు ఉద్యోగి ఎల్‌ఐసీ కార్యాలయంలో విధులను నిర్వహించే వారు. జూలై 31వ తేదీన పదవీ విరమణ పొందాడు. తన పదవీ విరమణ సమయంలో ఎవరూ బహుమతులు, బొకేలు వంటివి తీసుకొని రావద్దని, తప్పనిసరిగా తీసుకెళ్లాలి అనిపిస్తే 1కేజీ బియ్యం తీసుకొని రావాలని సూచించారు. ఈ మేరకు స్పందించిన ఆత్మీయులు, శ్రేయోభిలాషులు, బంధువులు, మిత్రులు ఆయన పదవీవిరమణ కార్యాక్రమంలో బియ్యం అందజేశారు. ఈ బియ్యాన్ని పీఎస్. మూర్తి స్థాపించిన స్వామి వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో పట్టణంలోని 30 కుటుంబాలను గుర్తించి ఒక్కో కుటుంబానికి 30 కేజీల చొప్పున పంపిణీ చేశారు. మరిన్ని కుటుంబాలకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

హోల్డ్‌లో పింఛన్లు.. ఇబ్బందుల్లో దివ్యాంగులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల మండలాధ్యక్షుడు హనుమంతరెడ్డి

ఆదోనిరూరల్: ఆదోని నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో వికలాంగుల పింఛన్లు హోల్డ్‌లో పెట్టడంతో తీవ్ర ఇబ్బందుల పడుతున్నామని వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం మండలాధ్యక్షుడు హనుమంతరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెరిఫికేషన్‌కు ముందు మెమోలు ఇవ్వకపోవడాన్ని ప్రశ్నించారు. కొంతమంది దివ్యాంగుల పింఛన్‌దారులకు ముందుగానే మెమోలు ఇచ్చినప్పటికీ మరికొన్ని గ్రామాల్లో వెరిఫికేషన్ రోజే మెమోలు ఇవ్వడంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. ఇదే విషయంపై సోమవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జనార్ధన్‌కు వివరించగా, సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు.